


‘నవరత్నాల పాంప్లెట్ ఓ భగవద్గీత.. బైబిల్, ఖురాన్ గ్రంథాల కంటే మాకు విలువైనది. ఈ నవరత్నాల్లో పేదలందరికీ ఇళ్ల పథకాన్ని చేర్చుతున్నాం. వైసీపీ అధికారం చేపట్టిన వెంటనే పేదలు ఇళ్లు కట్టుకొనేందుకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయిస్తుంది. గృహనిర్మాణ శాఖ ద్వారా ఇందుకోసం ఆర్థిక సహాయం చేస్తాం. అప్పటికీ ఇబ్బందులు పడే పేదలకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుంది. సొంత నివాసం లేకుండా ఒక్క పేద కుటుంబం ఉండదు.’

-పాదయాత్ర సమయంలో జిల్లాలో జగన్ ఇచ్చిన హామీ

జగనన్నా.. ఇల్లేది?







- అందరికీ కాదు కొందరికే కేటాయింపు
- అర్హులకు దక్కని ఇంటి పట్టాలు
- గ్రామాలకు దూరంగా భూ సేకరణ
- స్థలం లేదంటూ కొన్నిచోట్ల మొండిచేయి
- పేదల కలను నెరవేర్చలేకపోయిన ప్రభుత్వం

ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు.. ఎన్నెన్నో వాగ్దానాలు. ఓట్లు వేయించుకున్నారు. గెలిచారు.. అధికారం చేపట్టారు. ప్రజలను మాత్రం మర్చిపోయారు. హామీలు, వాగ్దానాలు గాలికొదిలేశారు. ఇవి ఒకటి, రెండు కాదు.. వందల సంఖ్యలో ఉన్నాయి. గద్దెనెక్కి ఐదేళ్లు పూర్తవుతున్నాయి. ప్రాజెక్టులు పూర్తి చేయలేదు. రోడ్లూ వేయలేదు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు మాట ఇచ్చి తప్పిన వైనంపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు..

శృంగవరపుకోట, ఏప్రిల్ 17

ఎస్.కోట మండలం వెంకటరమణపేట గ్రామానికి దూరంగా ఇళ్ల స్థలాలకు సేకరించిన స్థలం

- శృంగవరపుకోట మండలం వెంకటరమణపేటకు చెందిన పేదలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు ఊరికి దూరంగా భూమి సేకరించారు. దూరం కావడంతో పేదలెవరూ ముందుకు రాలేదు. ఇళ్ల నిర్మాణాల కోసం అధికారులు ఒత్తిడి పెంచడంతో విసుగు చెందిన పేదలు మూకుమ్మడి పట్టాలను తిరిగి ఇచ్చేశారు.
- ఎస్.కోట మండలంలోనే పెదఖండేపల్లి గ్రామానికి చెందిన పేదలకు పెద్ద,పెద్ద బండరాళ్లున్న ప్రాంతంలో ఇళ్ల పట్టాలను అందించారు. రాళ్లను తొలగించి స్థలం చదును చేసుకొనేందుకే రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలు ఖర్చు అవుతుందని తెలిసి పేదలు మరోచోట అనువైన స్థలాన్ని ఇవ్వాలని కోరారు. ఇప్పటికీ కదలిక లేదు.
- వేపాడ మండలం సోంపురం, అరిగిపాలెం గ్రామాలు జంట పంచాయతీలు. ఈ రెండు పంచాయతీల పరిధిలో ఇళ్ల పట్టాలు అందించేందుకు పేదలను గుర్తించారు. పట్టాలు ఇచ్చేందుకు భూమిని మాత్రం సేకరించలేదు. అందుబాటులో వున్న ప్రభుత్వ భూమి వైసీపీ నేతల ఆధీనంలో ఉంది. దీంతో అధికారులు అడిగే ధైర్యం చేయలేకపోయారు. ఈగ్రామాలకు సుమారు మూడు కిలోమీటర్లు దూరంలో వున్న నర్సిపల్లి మెట్ట వద్ద స్థల పరిశీలన చేశారు. ఇక్కడ పట్టాలు తీసుకొనేందుకు పేదలు ఇష్టపడలేదు.
- ఇళ్ల స్థలం కోసం దరఖాస్తు చేసిన 90 రోజుల్లో పట్టాలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో శృంగవరపుకోట మేజర్ పంచాయతీ పరిధిలో 481 మంది లబ్ధిదారులు ముందుకు వచ్చారు. వీరంతా దరఖాస్తు చేసి రెండేళ్లు గడుస్తున్నా పట్టాలు ఇవ్వలేదు. ఇప్పటికి చాలా మంది తహసీల్దార్ కార్యాలయం, స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. పంచాయతీ పరిధిలో పేదలకు ఇళ్ల పథకం కింద 1114 మందికి పట్టాలు పంపిణీ చేశారు అయితే వైసీపీ నేతల సన్నిహితులు, బంధువులే ఎక్కువగా లబ్ధిపొందారు.

జిల్లాలో ప్రతి మండలంలోనూ ఎంతో మంది అర్హులకు ఇళ్ల స్థలాలు దక్కలేదు. కొన్ని గ్రామాలకు దూరంగా స్థలాలు చూపించడంతో పేదలు అక్కడ నిర్మాణాలు చేపట్టేందుకు ఇష్టపడలేదు. పట్టాలు ఇచ్చిన గ్రామాల్లో అర్హులకంటే అనర్హులే ఎక్కువ ఉన్నారు. దీనిపై పేదల నుంచి వచ్చిన వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు నైంటీడేస్ (90 రోజులు) పథకాన్ని తెరమీదకు తెచ్చారు. దరఖాస్తు చేసిన 90 రోజుల్లో ఇళ్ల స్థల పట్టాను చేతిలో పెడతామని పేర్కొన్న ప్రభుత్వం రెండేళ్లయినా ఇవ్వకపోవడంతో నేటికీ వేలాది మంది పేదలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇలా పేదల సొంతింటి కల నిజం చేయడంలో జగన్ ప్రభుత్వం విఫలమైంది. అందరికీ కాదు కొందరికే ఇళ్ల పథకం అనిపించేలా చేసింది. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు జగన్ జిల్లాలో పాదయాత్ర చేశారు. ఆ సమయంలో పేదలందరికీ ఇళ్ల స్థల పట్టాలు ఇస్తామని ఊరూ వాడా వాగ్దానం చేశారు. ఇళ్ల స్థలంతో పాటు గృహ నిర్మాణ శాఖ ద్వారా ఆర్థిక సహాయం చేస్తామని కూడా చెప్పారు. అవసరమైతే ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుందనీ బీరాలు పలికారు.

అధికారంలోకి వచ్చిన తరువాత సాంఘిక సంక్షేమ శాఖ సేకరించి వుంచిన భూములపై పడ్డారు. ఇళ్ల స్థల పట్టాలకు కాంగ్రెస్, టీడీపీ సేకరించిన భూములను తామే సేకరించినట్లు బిల్డప్ ఇచ్చారు. తాత, తండ్రుల నుంచి తమ సొంత భూములుగా భావించి సాగు చేసుకుంటున్న రైతుల వద్ద నుంచి లాక్కున్నారు. కాగా లబ్ధిదారుల ఎంపికలోనూ అధికార పార్టీకి చెందిన వారికే లబ్ధి చేకూర్చారు. దీంతో అర్హుల కంటే అనర్హులకే ఎక్కువ లాభం చేకూరింది. దీనిపై పేదల నుంచి ఆందోళన వ్యక్తమవడంతో దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో స్థలం ఇస్తామని సరికొత్త నాటకం ఆడారు. ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో ప్రైవేటు స్థలాలు కొంటున్నట్లు నివేదికలు తయారు చేశారు. ఈ విధానంలోనే శృంగవరపుకోట పంచాయతీలో 11 ఎకరాలు సేకరించారు. ప్రతిపాదనలతోనే సరిపెట్టారు. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో ఒక మంచం కూడా పట్టని గది స్థలం వుండడం, ఇచ్చిన స్థలాల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పాటు ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు సరిపోక చాలా మంది ఇళ్ల నిర్మాణాలకు వెనుకంజ వేశారు. ఇంటి స్థలం వెనక్కితీసుకుంటామని బెదిరించడంతో కొంత మంది అదనంగా మరో నాలుగు లక్షలు అప్పు చేసి కట్టారు. ఇప్పుడు ఇలాంటి వారంతా వడ్డీలు కట్టలేక సతమతమవుతున్నారు.

నేడే విడుదల



- ఎన్నికల ప్రధాన ఘట్టానికి కొద్ది గంటల్లో శ్రీకారం
- నోటిఫికేషన్ వచ్చిన వెంటనే నామినేషన్ల స్వీకారం
- అభ్యర్థితో పాటు ఐదుగురికి మాత్రమే అనుమతి
- అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు
- విజయనగరం కలెక్టరేట్‌లో ఎంపీ నామినేషన్లు

(విజయనగరం- ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ప్రధాన ఘట్టానికి కొద్ది గంటల్లో కీలక అడుగు పడనుంది. ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల కానుంది. ఇందుకోసం జిల్లా ఎన్నికల అధికారి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నోటిఫికేషన్ విడుదలైన వెంటనే నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. జిల్లాలోని విజయనగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం, బొబ్బిలి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గ కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. కొన్ని చోట్ల ఆర్డీఓ కార్యాలయం వద్ద కూడా ఏర్పాట్లు చేశారు. విజయనగరం పార్లమెంట్ అభ్యర్థులు జిల్లా ఎన్నికల అధికారికి కలెక్టరేట్‌లో నామినేషన్లు అందజేస్తారు. నామినేషన్లు వేసే అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి వద్దకు అనుమతిస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ప్రకటించారు. మిగిలిన వారు 100మీటర్ల దూరంలో ఉండాలి. మూడు వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. ఒక్కో అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ల పత్రాలు దాఖలు చేయవచ్చు. ఒక అభ్యర్థి రెండు నియోజకవర్గాల్లో గరిష్ఠంగా పోటీ చేసే వీలుంది.

- పోటీ చేసే అభ్యర్థులు అసెంబ్లీకి రూ.10వేలు, పార్లమెంట్‌కు రూ.25వేలు ధరావతు చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం చెల్లిస్తే సరిపోతుంది. ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. కోడ్ అమల్లో ఉన్న కారణంగా అభ్యర్థుల ఊరేగింపులు, నామినేషన్ల దాఖలు చేసేటపుడు పూర్తిగా రికార్డింగ్ చేస్తారు.
- అభ్యర్థులు 13రకాల డాక్యుమెంట్లు తీసుకురావాలి. నామినేషన్లను ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు స్వీకరిస్తారు. ప్రభుత్వ సెలవు దినాల్లో నామినేషన్ స్వీకరణ ఉండదు. నామినేషన్లను అభ్యర్థి నేరుగా కాని, తను సూచించిన వ్యక్తి ద్వారా కాని సమర్పించవచ్చు. నామినేషన్‌తో పాటు కొత్తగా తెరిచిన బ్యాంక్ ఖాతాను ఇవ్వాలి. నామినేషన్ల స్వీకరణకు ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తారు. సువిధ యాప్ ద్వారా కూడా నామినేషన్లను దాఖలు చేయవచ్చు. కాని హార్డ్ కాపీలను ఆర్‌వోకు అందించాల్సి ఉంటుంది.

ముఖ్యమైన తేదీలు

- 18న గురువారం ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- 26న నామినేషన్ల పరిశీలన
- 29న నామినేషన్ల ఉపసంహరణ
- మే 13న పోలింగ్
- జూన్ 4న ఓట్ల లెక్కింపు

కమనీయం.. రాములోరి కల్యాణం

- కన్నుల పండువగా వివాహ వేడుక
- మార్మోగిన రామనామస్మరణ
- తిలకించి తరించిన భక్తజనం



మంగళసూత్రం చూపుతున్న అర్చకుడు



కల్యాణానికి హాజరైన భక్తులు, ప్రముఖులు

రామతీర్థంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. భక్తిప్రపత్తులతో జైశ్రీరాం నినాదాల నడుమ ఒక్కో ఘట్టం కమనీయంగా సాగింది. విశ్వక్షేణ పూజతో ప్రారంభమైన కల్యాణోత్సవం తలంబ్రాల తంతు వరకు మూడున్నర గంటలసేపు ఎంతో వైభవంగా నడిచింది. జీలకర్ర బెల్లం ఘట్టం, మంగళసూత్రధారణ, తలంబ్రాలను చల్లుకునే ప్రక్రియలను చూసి భక్తులు పులకించారు. కల్యాణోత్సవాన్ని ఆద్యంతం భక్తులు కనులార్పకుండా చూసి ఆనంద పరవశులయ్యారు.

నెల్లిమర్ల, ఏప్రిల్ 17: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా రామతీర్థంలో బుధవారం సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. దేవస్థానం వెనుక వైపున ఉన్న సువిశాలమైన స్థలంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై తొలుత సీతారాములను కొలువుదీర్చారు. అర్చకులు ఖండవిల్లి కిరణ్‌కుమార్, సాయిరామాచార్యులు, గొడవర్తి నరసింహాచార్యుల బృందం కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ వేడుకకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఉత్సవ ప్రత్యేక అధికారి, సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి పట్టువస్త్రాలను, ముత్యాలను అర్చకులకు సమర్పించారు. వీరితో పాటు రాష్ట్ర విద్యామంత్రి బొత్స సత్యనారాయణ, ఝాన్సీలక్ష్మి దంపతులు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతులు, రాష్ట్ర సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి వ్యక్తిగతంగా స్వామివారికి పట్టువస్త్రాలను అందజేశారు.

కల్యాణ ఘట్టాలను నంద్యాలకు చెందిన ప్రముఖ వేద పండితుడు డీవీ హయగ్రీవాచార్యులు వివరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వేదిక ఎదురుగా, చుట్టూ టెంట్ హౌస్‌లు ఏర్పాటు చేసి కుర్చీలు వేశారు. రామతీర్థం ప్రాంతం బుధవారం రామనామ స్మరణతో మార్మోగింది. కల్యాణాన్ని దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరగ్గా ఉత్సవ ప్రత్యేక అధికారి శ్రీనివాసమూర్తి పర్యవేక్షించారు. కల్యాణోత్సవం ముగిసిన తర్వాత ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు బుధవారం సాయంత్రం ఆలయానికి చేరుకుని సీతారాములను దర్శించుకున్నారు. అర్చకుల నుంచి ఆశీర్వాదం అందుకున్నారు.

పులకించిన భద్రగిరి



- కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతా రాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంత రావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది.

-భద్రాచలం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానం వారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



సార్వత్రిక ఎన్నికల సమరానికి సమయం ఆసన్నమైంది. గురువారం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఇప్పటికే అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టినా.. అసలైన సమరం ఇప్పుడే మొదలవబోతోంది. ఇక్కడి నుంచి పోలింగ్ రోజు వరకు ప్రతి క్షణమూ విలువైనదే. నామినేషన్ దాఖలు నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు అటు ఓటరు కరుణ పొందడానికి ప్రయత్నించడంతో పాటు ఇటు ఎన్నికల నిబంధనలు పాటించడం వరకూ అప్రమత్తంగా ఉండాల్సిందే. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తీసుకోవలసిన జాగ్రత్తలు.. నిబంధనలను పరిశీలిద్దాం.

సమరానికి.. నేడే ఆరంభం



- సార్వత్రిక ఎన్నికలకు వేళాయే
- నేటి నుంచి నామినేషన్లు
- 25 వరకు స్వీకరణ
- మే 13న పోలింగ్
- జూన్ 4న ఓట్ల లెక్కింపు

(శృంగవరపుకోట/కొమరాడ)

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి వయస్సు 25 ఏళ్లు నిండి.. భారత పౌరుడై ఉండాలి. రాష్ట్రంలో ఏదైనా నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి. ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల తరపున పోటీ చేసే వారి అభ్యర్థిత్వాన్ని ఒకరు బలపరచాలి.

- బలపరిచిన అభ్యర్థి నియోజకవర్గ పరిధిలో ఓటరుగా ఉండాలి. పేరు, పోలింగ్ కేంద్రం, ఓటరు జాబితాలో వరుస సంఖ్య, వంటి అంశాలను ప్రస్తావించాలి.
- స్వతంత్రంగా పోటీ చేసే అభ్యర్థులకు మాత్రం పది మంది ఓటర్లు బలపరచాలి. ప్రజా ప్రాతినిధ్య చట్టం 33(1) ప్రకారం ఇది తప్పనిసరి. భారత ఎన్నికల సంఘం వద్ద రిజిస్టరైన ఇంకా గుర్తింపు లేని పార్టీలు (రిజిస్టర్డ్ అన్‌రికగ్నైజ్డ్) నుంచి పోటీ చేసే అభ్యర్థులకు కూడా పది మంది బలపరిచేవారు ఉండాలి. లేదంటే నామినేషన్‌ను తిరస్కరిస్తారు. నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు లేకపోయినా ప్రతిపాదన చెల్లదు.



మూడు వాహనాలే..

అభ్యర్థులు ప్రచారానికి మూడు వాహనాలను మాత్రమే వినియోగించాలి. వీటికి ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరి. వాహనాలు ఎక్కువ ఉంటే ఎన్నికల సంఘం చర్యలకు గురవుతారు. అభ్యర్థి వ్యయంలో నమోదు చేస్తారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలోనూ జాగ్రత్తలు పాటించాలి. వ్యక్తిగత దూషణలు, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగించకూడదు.
- దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద ఓట్లు అడగరాదు. ఓటర్లకు డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు గురిచేయరాదు.
- ఎన్నికల ప్రచార సమయంలో ఇరు పార్టీలు ఎదురురెదుగా రాకూడదు. ఒక పార్టీ ప్రచార ప్రతులను మరో పార్టీ చించకూడదు.
- సమస్యలపై ధర్నాలు, ర్యాలీలు, సభలు వంటివి నిర్వహించకూడదు.
- అధికారుల అనుమతితో లౌడ్ స్పీకర్లు వినియోగించాలి.
- పాఠశాలలు, ప్రార్థనా మందిరాల వద్ద ప్రచారాలు నిషేధం.



ముఖ్యమైన తేదీలు

- నామినేషన్ల దాఖలు: ఏప్రిల్ 18 నుంచి 25
- నామినేషన్ల పరిశీలన: 26
- ఉపసంహరణ: 29
- పోలింగ్: మే 13
- ఓట్ల లెక్కింపు: జూన్ 4

నామినేషన్ ఫీజు ఇలా..



శాసనసభ ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థులు (జనరల్) డిపాజిట్‌గా రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.5వేలు చెల్లించాలి. ఎంపీ అభ్యర్థులు (జనరల్) రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.12,500, చెల్లించాల్సి ఉంటుంది. డిపాజిట్ మొత్తం నగదు రూపంలో నామినేషన్ సమర్పించిన సమయంలో ఇవ్వాల్సి ఉంటుంది.

వ్యయం ఇలా...

శాసన సభకు పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షలు, పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థి రూ.95 లక్షలు ఖర్చు చేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. అంతకు మించి వ్యయమైతే ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుంది.

నామినేషన్ పత్రాల దాఖలు ఇలా..

శాసనసభ నియోజకవర్గ అభ్యర్థులు నియోజకవర్గ కేంద్ర తహసీల్దార్ కార్యాలయాల్లో రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలు సమర్పించాలి. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు జారీ చేసిన బి-ఫారాలు నామినేషన్ ఫారాలకు జతచేయాలి.

- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉండే తహసీల్దార్ కార్యాలయానికి కనీసం వంద మీటర్ల దూరంలో ర్యాలీలు నిలిపివేయాలి. అభ్య ర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే అనుమతిస్తారు.
- నామినేషన్ దాఖలు చేయడానికి 48 గంటల ముందు అభ్యర్థులు తప్పనిసరిగా వారి పేరిట ఏదైనా గుర్తింపు పొందిన బ్యాంకులో ఖాతా తెరవాలి. ఆ ఖాతా ద్వారానే ఎన్నికల ప్రచారానికి, ఇతర అవసరాలకు వెచ్చించిన సొమ్ముకు సంబంధించిన లావాదేవీలు నిర్వహించాలి. ఖాతా పుస్తకం ప్రతిని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఇవ్వాలి.
- విద్యార్హతలు, నేర చరిత్ర, ఆస్తులు, అప్పులకు సంబంధించిన పత్రాలు అందించాలి. నేర చరిత్ర కలిగి, కోర్టుల్లో కేసులు ఉన్నవారు నేర వివరాల సంఖ్యను ప్రస్తావించాలి. పార్లమెంటు అభ్యర్థులు జిల్లా కేంద్రాల్లో నామినేషన్లు సమర్పించాలి.
- ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగానికి రాజీనామా చేయాలి. రాజీనామాను ఆమోదించినట్లు ప్రభుత్వం జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని నామినేషన్‌తో పాటు దాఖలు చేయాలి.



- అభ్యర్థులు ఇంటి, నీటి పన్ను, విద్యుత్ చార్జీల బిల్లు బకాయిలు లేనట్లు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి.

వృద్ధులు.. దివ్యాంగులకు హోమ్ ఓటింగ్

- జిల్లాలో 29,174 మంది గుర్తింపు
- నేటి నుంచి 22 వరకూ దరఖాస్తుల స్వీకరణ
- మే 7 నుంచి 10 వరకు హోం ఓటింగ్



కలెక్టరేట్ (విజయనగరం): ఈసారి వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల కమిషన్ హోం ఓటింగ్ సదుపాయం కల్పించింది. అందుకు సంబంధించి జిల్లా అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు రకాల కేటగిరీల వారికి పోస్టల్ బ్యాలెట్ అందజేస్తారు. కోవిడ్ బారిన పడిన వారు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు... 40 శాతం పైబడి వైకల్యం ఉన్నవారు... 33 రకాల అత్యవసర విభాగాల్లో పని చేస్తున్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తారు. వీరిలో వృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 29,174 మంది హోం ఓటింగ్‌కు ఉన్నట్లు బీఎల్‌వోలు గుర్తించారు. హోం ఓటింగ్ కావలసిన వారు ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకూ ఫారం 12(డి) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ దరఖాస్తులను పరిశీలించి 26 నాటికి తుది జాబితా తయారు చేస్తారు. నామినేషన్లు ముగిసిన తరువాత.. బ్యాలెట్ పేపర్లు ముద్రించిన తరువాత వీరికి మే నెల 7 నుంచి 10వ తేదీ వరకూ హోం ఓటింగ్ నిర్వహిస్తారు. జిల్లాలో సుమారు 7,181 మంది 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న 21,993 మంది దివ్యాంగులు ఉన్నారు. హోం ఓటింగ్‌కు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య అవకాశాన్ని కల్పిస్తారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, వీడియోగ్రాఫర్లు, మైక్రో అబ్జర్వర్‌తో పాటు బీఎల్‌వోలు, పార్టీల ఏజెంట్లు కూడా దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి... ఓటు తీసుకుంటారు. బ్యాలెట్ పత్రాల ద్వారా జరిగే ఈ విధానంలో కూడా దరఖాస్తుదారుని ఇంట్లో ప్రత్యేకంగా కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసి... ఏకాంతంగా ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తారు. అవసరమైన పక్షంలో కుటుంబ సభ్యులను మాత్రమే వారికి సహకారం అందించేందుకు అనుమతిస్తారు. ఈ మొత్తం ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేస్తారు. హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసిన వారికి పోలింగ్ బూత్‌లో ఓటు వేసే అవకాశం ఉండదు.

దరఖాస్తులు స్వీకరిస్తాం

కేంద్ర ఎన్నికల కమిషన్ ఈసారి వృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్ కోసం కొత్తగా అవకాశం కల్పించింది. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నాం. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 26న తుది జాబితా తయారు చేస్తాం. వచ్చే నెల 7 నుంచి 10 తేదీ వరకూ హోమం ఓటింగ్ నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తాం.

- కె.సందీప్ కుమార్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి



పార్వతీపురం మన్యం జిల్లాలో నామినేషన్లు స్వీకరించేది వీరే..

కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లాలో సాధారణ ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అరకు పార్లమెంటు నియోజకవర్గంతో పాటు పాలకొండ, పార్వతీపురం, కురుపాం, సాలూరు నియోజకవర్గాలకు నామినేషన్లు స్వీకరించే అధికారుల వివరాలు ఇలా..

ఎన్నికల రిటర్నింగ్ అధికారి	ఫోన్ నెం.	నామినేషన్ల స్వీకరణ స్థలం
అరకు పార్లమెంటరీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నిశాంత్‌కుమార్ (కలెక్టర్)	86880 81801	కలెక్టర్ కార్యాలయం
పాలకొండ శాసనసభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి (ఐటీడీఏ పీవో, సీతంపేట)	80088 03933	సీతంపేట ఐటీడీఏ కార్యాలయం
సాలూరు శాసనసభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి సి.విష్ణుచరణ్ (పార్వతీపురం ఐటీడీఏ పీవో)	94913 09822	సాలూరు తహసీల్దార్ కార్యాలయం
పార్వతీపురం శాసనసభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కె.హేమలత (పార్వతీపురం ఆర్డీవో)	94910 12022	పార్వతీపురం ఆర్డీవో కార్యాలయం
కురుపాం శాసనసభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వి.వెంకటరమణ (పాలకొండ ఆర్డీవో)	98898 83802	కురుపాం తహసీల్దార్ కార్యాలయం

బై..పాస్ రోడ్డు!

- ఎమ్మెల్యే బడ్డుకొండ హామీ నెరవేరని వైనం

నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని బోడికొండను ఆనుకొని నిర్మిస్తామని చెప్పిన బైపాస్ రోడ్డుకు బైబై చెప్పేసినట్టేనా? దీని నిర్మాణంపై ఎంఎల్ఏ బడ్డుకొండ అప్పలనాయుడు ఇచ్చిన హామీ ఐదేళ్లుగా అలాగే ఉండిపోయింది. నెల్లిమర్ల నుంచి రణస్థలానికి చేరుకోవడానికి ఆర్ అండ్ బీ రోడ్డు రామతీర్థం గ్రామం మధ్య నుంచి వెళుతుంది. దీని వల్ల వాహనాల రాకపోకలకు.. స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో జరిగే ఉత్సవాల సమయంలో ఈ రోడ్డు భక్తులతో నిండిపోతుంది. ఆ సమయంలో వాహనాల రాకపోకలను తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఏటా శివరాత్రి, ఆ మరుసటి రోజున లక్షలాది మందితో జరిగే పెద్ద జాతర సమయంలో రామతీర్థం ఆవలి గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఈ రోడ్డు దాటడం కత్తి మీదసామే. ఈ ఉత్సవాల సమయంలో కష్టాలను పరిగణనలోకి తీసుకుని బైపాస్ రోడ్డు నిర్మిస్తామని గత ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే బడ్డుకొండ హమీ ఇచ్చారు. ఆ హామీ ఇప్పటికీ నెరవేరలేదు. ప్రజల కష్టాలు అలాగే ఉన్నాయి. ఉత్సవ సమయంలో సమీపంలోని సీతారామునిపేట- దన్నానపేట రోడ్డే దిక్కవుతోంది. బడ్డుకొండ హామీ నెరవేరకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



బైపాస్ రోడ్డు నిర్మించాల్సిన ప్రాంతం ఇదే

ఎన్నికలకు సర్వం సిద్ధం

- మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధంగా ఉన్నామని కలెక్టర్, ఎన్నికల అధికారి నిశాంత్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. గురువారం నోటిఫికేషన్ విడుదలవుతుండగా, ఆ రోజు నుంచి ఈనెల 25 వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చన్నారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలు, తదితర పోస్టులపై నిరంతర నిఘా ఉంటుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 48 ఎఫ్ఎస్‌టీ, 36 ఎస్ఎస్‌టీ, 16 వీఎస్, నాలుగు వీవీ బృందాలు పనిచేస్తున్నాయన్నారు. జిల్లాలో అంతర్రాష్ట్ర సరి హద్దులైన ములిగూడ, బత్తిలి, భామిని, పి.కోనవలస, కోనేరు కూడళ్లలోను, గుణుపూర్, పద్మాపూర్, దండిగాం, ఆర్‌కే బట్టివలస, అడారు వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. 25 పోలింగ్ కేంద్రాల లొకేషన్లను నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించామని, 439 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి చేయాలి..

అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న సహాయ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్‌లు, వీడియో వ్యూయింగ్ బృందాలు పటిష్ఠంగా పనిచేయాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత మాట్లాడుతూ.. రంపచోడవరం గురుకుల పాఠశాలలో, అరకు, పాడేరు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి పాడేరులో లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శోభిక, ఎస్‌డీసీఆర్ వి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




ఎస్పీతో కలిసి మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

వలంటీర్లతో రాజీనామాలు చేయించాల్సిందే

- గ్రామస్థాయి వైసీపీ క్యాడర్‌కు ముఖ్య నాయకుల ఆదేశాలు
- వారి ఫోన్లకు మెసేజ్‌లు పంపుతున్న నియోజకవర్గ స్థాయి నేతలు

గరుగుబిల్లి: వలంటీర్లతో మూకుమ్మడిగా రాజీనామాలు చేయించాలని నియోజకవర్గ వైసీపీ నేతలు గ్రామస్థాయి నాయకులను ఆదేశిస్తున్నారు. ఈ మేరకు వారి ఫోన్లకు మెసేజ్‌లు పంపుతు న్నారు. 'కష్ట కాలంలో ఉన్నాం.. కలిసి రండి' అని ప్రాధేయపడి.. వలంటీర్లతో రాజీనామా పత్రాలు ఇప్పించాలని సూచిస్తున్నారు. నియోజకవర్గ నేతల ఆదేశాలతో గ్రామస్థాయి నేతలు సంబంధిత వలంటీర్లతో సంప్రదింపులు చేస్తున్నారు. గురువారం నాటికి పూర్తిస్థాయిలో రాజీనామాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ప్రస్తుతం వైసీపీకి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొనడంతో ఆ పార్టీ నేతలు ఆందోళనకు గురవుతున్నారు. క్షేత్రస్థాయిలో ప్రచారానికి కార్యకర్తలు కొరత కూడా నెలకొనడంతో వలంటీర్లే వారి దిక్కులా కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారితో బలంతంగా రాజీనామాలు చేయించేందుకు ప్రయత్నిస్తున్నారు. 'వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మిమ్మల్ని నియమించాం, మేము చెప్పినట్టుగా వ్యవహరించాల్సిందే' అని మరికొందరు వలంటీర్లకు హుకుం జారీ చేస్తున్నారు. మండల, నియోజకవర్గ, గ్రామస్థాయి నేతలు ఒత్తిడి తేవడంతో పలు గ్రామాల్లోని వలంటీర్లు తలలు పట్టుకుంటున్నారు. ఒకవైపు నేతలు, మరోవైపు ఎమ్మెల్యోలు ఇదే పనిగా వ్యవహరించడంతో దిక్కు తోచని స్థితిలో వారున్నారు. 'మళ్లీ వైసీపీ అధికారంలోకి రాగానే వలంటీర్‌కు రూ. 10 వేల చొప్పున గౌరవ వేతనం అందుతుంది.. ప్రస్తుతం రాజీనామా చేసిన వారికే మొదటి ప్రాధాన్యం ఇస్తాం..' అని హామీలు గుప్పిస్తున్నారు. గెలుపు బాధ్యత వలంటీర్లపైనే ఉందని చెప్పుకొస్తున్నారు. అయితే కొందరు వలంటీర్లు మాత్రం రాజీనామాలకు దూరంగా ఉంటున్నారు. అధికంగా తెలుగుదేశం పార్టీ వైపే మొగ్గు చూపుతున్న పరిస్థితి నెలకొంది. కాగా ఇప్పటికే రాజీనామాలు చేసిన పలువురు వలంటీర్లు వైసీపీ కండువాలు వేసుకొని ప్రచారంలోకి దిగుతున్నారు.



వలంటీర్లతో రాజీనామాలు చేయించాలని వైసీపీ ప్రతినిధులకు వచ్చిన వాట్సాప్ మెసేజ్

రాజన్నదొరా.. ఇక్కట్లు చూసితిరా!

- పోలమాంబ భక్తులకు అగచాట్లు
- ఏటా చెట్ల కిందనే వంటావార్పు



మక్కువ: అది ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం శ్రీశంబర పోలమాంబ అమ్మవారు కొలువైన ప్రాంతం. పైగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర వారి సొంత మండలం. పోలమాంబ దర్శనానికి ఉత్తరాంధ్ర జిల్లాలోని నలుమూలల నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఇక పోలమాంబ జాతర జరిగిన నాటి నుంచి దాదాపు పది నుంచి 15 వారాల పాటు రద్దీగా ఉంటుంది. ఇక్కడ విశ్రాంతి తీసుకోవడానికి ఎటువంటి షెడ్లూ లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అవస్థలు పడుతున్నారు. అమ్మవారిని దర్శించుకొని.. మొక్కులు చెల్లించి... కుటుంబ సభ్యులతో పోలమాంబ ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న తోటల్లోని చెట్ల కింద వంటావార్పూ చేస్తూ సేద తీరుతున్నారు. ఇక్కడ శాశ్వత షెడ్ల నిర్మాణానికి... ఆలయ అభివృద్ధికి... భక్తులకు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని మంత్రి గారు స్వయంగా మాటిచ్చారు. కానీ అవేవీ ఆచరణకు నోచుకోలేదు. ఏటా జాతరకు కొద్ది రోజుల ముందు భక్తుల కోసం విశ్రాంతి మందిరాలు నిర్మిస్తామని అధికారులు చెప్పడం ఆనవాయితీగా మారింది. పోనీ మంత్రి మాటనైనా నిలబెట్టుకుంటారంటే...అదీ లేదు. భక్తుల కష్టాలు మాత్రం అలాగే ఉన్నాయి.




చెట్ల కింద వంట చేస్తున్న భక్తులు

నియోజకవర్గం : విజయనగరం

మొత్తం ఓటర్లు: 2,12,092
పురుషులు : 1.05,161
స్త్రీలు : 1,06,928
ట్రాన్స్‌జెండర్లు : 3

టీడీపీకి విజైనగరం

- విజయనగరం ఓటర్ల తీర్పు విలక్షణం..
- ఏడు పర్యాయాలు తెలుగుదేశానిదే హవా
- కాంగ్రెస్‌కు రెండుసార్లే అవకాశం
- ఎక్కువ కాలం పూసపాటి వంశీయుల పరిపాలనలోనే...
- అత్యధికసార్లు విజేత అశోక్ గజపతిరాజు



● విజయనగరం ముఖచిత్రం

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

విజయనగరం చారిత్రక పట్టణం. జిల్లా కేంద్రంగా... కార్పొరేషన్‌గా అభివృద్ధి చెందింది. పూసపాటి రాజుల పరిపాలనా కేంద్రం. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1951లో విజయనగరం నియోజకవర్గం ఏర్పడింది. విజయనగరం జిల్లా కేంద్రంగా 1979 జూన్ 1న ఆవిర్భవించింది. మొదటి అసెంబ్లీ ఎన్నికలు 1952లో జరిగాయి. మొదటిసారి జరిగిన ఎన్నికల్లో నియోజవర్గ ప్రజలు పూసపాటి రాజ వంశీయుడైన పీవీజీ రాజును గెలిపించారు. జాతీయ కాంగ్రెస్ గాలిలో కూడా పీవీజీ రాజు సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగి స్వతంత్ర అభ్యర్థి గుడివాడ అప్పలస్వామిపై భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. తరువాత 1955లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ పీవీజీ రాజు ప్రజా సోషలిస్టు పార్టీ తరఫున విజయం సాధించారు. 1957లో భట్టం శ్రీరామ్మూర్తి సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. 62లో కాంగ్రెస్ అభ్యర్థిగా భట్టం గెలుపొందారు. 67లో ఒబ్బిశెట్టి రామారావు భారతీయ జన సంఘ్ తరపున పోటీ చేసి విజయం సాధించారు. 1972లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అప్పసాని అప్పన్నదొర గెలుపొందారు. విజయనగరం అసెంబ్లీకి 16 పర్యాయాలు ఎన్నికలు జరిగితే... జాతీయ కాంగ్రెస్ అభ్యర్థులు 1962, 1972లో రెండు పర్యాయాలు మాత్రమే విజయం సాధించగలిగారు.

కళలకు పుట్టినిల్లు

రాజుల పరిపాలనలో ఉన్న విజయగనరం కళలకు కాణాచిగా ఖ్యాతికెక్కింది. సంగీత, నృత్య కళాశాలను విజయనగరం రాజులు 1955లో స్థాపించారు. సుప్రసిద్ధ సినీ నేపథ్య గాయని, గాన కోకిల పి.సుశీల, గాన గంధర్వుడు ఘంటసాల వంటివారు ఇక్కడ శిక్షణ పొందినవారే. సాలూరు రాజేశ్వరరావు, వయోలిన్ విద్వాంసుడు ద్వారం వెంకటస్వామినాయుడు ఈ గడ్డలో పుట్టిన వారే. హరికథా పితామహుడు ఆదిబట్ల నారాయణదాసు సంగీత, నృత్య కళాశాలకు మొదటి ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ద్వారం వెంకటస్వామినాయుడు ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఈ కళాశాలలో శిక్షణ పొందిన వారు దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు గడించారు.



ఎమ్మెల్యేలుగా వీరే..



పీవీజీ రాజు



అశోక్ గజపతిరాజు



కోలగట్ల వీరభద్రస్వామి



మీసాల గీత

1978లో రాజకీయ అరంగేట్రం చేసిన పీవీజీ రాజు కుమారుడు పూసపాటి అశోక్ గజపతిరాజు ఎదురులేని నాయకునిగా విజయదుందుభి మోగించారు. విజయనగరం ఓటర్లు అశోక్‌ను వరుసగా ఆరు పర్యాయాలు గెలిపించారు. 1983లో ఎన్‌టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించడంతో అశోక్ టీడీపీలో చేరారు. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన అశోక్ 78 (జనతా పార్టీ), 83, 85, 89, 94, 99 ఎన్నికల్లో వరుసగా విజయాలు సొంతం చేసుకొని రికార్డు సృష్టించారు. 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ గాలిలో కూడా అశోక్ విజయం సాధించారు. ఇలా అశోక్ ఏడు పర్యాయాలు విజయనగరం ఎమ్మెల్యేగా పనిచేశారు. 2014లో ఆయన విజయనగరం పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికై మోదీ ప్రభుత్వంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా వ్యవహరించారు. భోగాపురం ఎయిర్ పోర్టు మంజూరులో కీలకపాత్ర పోషించారు. ఇది విజయనగరం ఖ్యాతిని ఇనుమడింపజేయనుంది.

● 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి గాలిలో కూడా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కోలగట్ల వీరభద్రస్వామికి పట్టం కట్టిన విలక్షణ ఓటర్లు విజయనగరం వాసులు. 2019లో వైసీపీ ఎమ్మెల్యేగా కోలగట్ల విజయం సాధించి డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు.

సం.	ఎమ్మెల్యేలుగా పనిచేసినవారు	పార్టీ
1952	పీవీజీ రాజు	సోషలిస్టు పార్టీ
1955	పీవీజీ రాజు	ప్రజా సోషలిస్టు పార్టీ
1957	భట్టం శ్రీరామ్మూర్తి	సోషలిస్టు పార్టీ
1962	భట్టం శ్రీరామ్మూర్తి	కాంగ్రెస్
1967	ఒబ్బిశెట్టి రామారావు	భారతీయ జనసంఘ్
1972	పి.అశోక్ గజపతిరాజు	జనతా పార్టీ
1983	పి.అశోక్ గజపతిరాజు	స్వతంత్ర అభ్యర్థి (టీడీపీ మద్దతు)
1985	పి.అశోక్ గజపతిరాజు	టీడీపీ
1989	పి.అశోక్ గజపతిరాజు	టీడీపీ
1994	పి.అశోక్ గజపతిరాజు	టీడీపీ
1999	పి.అశోక్ గజపతిరాజు	టీడీపీ
2004	కోలగట్ల వీరభద్రస్వామి	స్వతంత్ర అభ్యర్థి
2009	పి.అశోక్ గజపతిరాజు	టీడీపీ
2014	మీసాల గీత	టీడీపీ
2019	కోలగట్ల వీరభద్రస్వామి	వైసీపీ



పూసపాటి రాజుల కోట

వీటితో గుర్తింపు...

విజయగనరం పేరు చెబితే వెంటనే గుర్తుకు వచ్చేవి రాజుల కోట.. గంటస్తంభం... సంస్కృత కళాశాల... సంగీత నృత్య కళాశాల... పెద్ద చెరువు... మూడు లాంతర్లు... పైడి తల్లి అమ్మవారు. ఏటా అమ్మవారి పండగ నిర్వహిస్తున్నారు. పూసపాటి రాజ వంశీయుల ఆడపడుచు పైడితల్లి. రాజుల కాలంలో ఆధ్యాత్మికతకు పెద్ద పీట వేశారు. ఇందులో భాగంగానే సింహాచల దేవస్థానం.. రామతీర్థం ఆలయం, పైడితల్లి అమ్మవారు... ఇలా వివిధ ఆలయాలను నిర్మించారు.

విజయనగరం వ్యూ..



విద్యల నగరంగా..

విజయనగరం విద్యల నగరంగా వర్ధిల్లింది. ఇక్కడ సంస్కృత కళాశాలను రాజులు స్థాపించారు. వేదాలు, ఉపనిషత్తులు సంస్కృతంలో చదువుకునేందుకు అనేక మంది దేశం నలుమూలల నుంచి వచ్చేవారు. తదనంతర కాలంలో మహారాజా కళాశాలను స్థాపించారు. న్యాయ కళాశాల, ఉపాధ్యాయ శిక్షణ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాలలను రాజులు నెలకొల్పారు. ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ఏర్పాటు చేశారు.



మూడు లాంతర్ల జంక్షన్



పంతులు గారూ..
ముహూర్తం చూడండి

విజయనగరం, ఏప్రిల్ 17: జిల్లాలో ప్రస్తుతం పొలిటికల్ ముహూర్తాల సమయం నడుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేయడానికి అభ్యర్థులు జ్యోతిష్యులను ఆశ్రయిస్తున్నారు. పేరు, రాశి బలాల మీద నామినే షన్ల తేదీలను ఖరారు చేస్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికల్లో టికెట్ దక్కించుకోవడం ఒక ఎత్తయితే... ఆ తర్వాత విజయం సాధించడానికి అంగ, అర్థబలంతోపాటు దేవుని ఆశీస్సులు అవసరమని భావిస్తున్నారు. ఎక్కువ మంది ముహూర్తం కలిసివస్తే విజయం సాధిస్తామని నమ్ముతున్నారు. దీంతో తమకు తెలిసిన జ్యోతిష్యులు, పండితులను సంప్రదిస్తున్నారు. నామినేషన్ల ఘట్టం గురువారం నుంచి ప్రారంభం కానుండడంతో పోటీ చేయనున్న అభ్యర్థులు తమ పేరుమీద మంచి ముహూర్తం కోసం పలువురు పండితులను కలిసి... ఖరారుచేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే దాదాపుగా జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు, లోక్‌సభ సెగ్మెంట్‌కు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులను ప్రకటించారు. కొన్ని నియోజకవర్గాల్లో గుర్తింపులేని, రిజిస్టర్, చిన్న పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు రంగంలో నిలిచేందుకు సమాయత్తమవుతున్నారు.

పేరు, రాశి బలాలను బట్టి ..

జిల్లాలో ఈనెల 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభంకానుంది. ఆరోజు గురువారం కావడం, దశమి కొందరికి కలిసి వచ్చే అవకాశం ఉంటుందని పండితులు చెబుతున్నారు. 19న ఏకాదశి తిథి, నక్షత్రం ముఖ నక్షత్రం, 20న శనివారం ద్వాదశి... పుబ్బ నక్షత్రం. ఆరోజు నామినేషన్ వేసేందుకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తారు. 21న సెలవురోజు 22న చతుర్దశి, హస్త నక్షత్రం, 23న పౌర్ణమి మంచిదే కానీ మంగళవారం సెంటిమెంట్‌తో ఎక్కువ మంది నామినేషన్ వేసేందుకు ముందుకు రాకపోయే అవకాశముంది. 24, 25 తేదీలలో పాడ్యమి స్వాతి, విశాఖ నక్షత్రాలు కావడంతో ఆ రోజు నామినేషన్ల దాఖలకు మంచిదని పండితులు చెబుతున్నారు. దీనిని బట్టి నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు.

మరచిపోయారు.. కా'బట్టి'

- రూపుమారని బట్టి కాలువ
- మాట తప్పిన సీఎం జగన్
- ఏడాదైనా నెరవేరని హామీలు

(భోగాపురం)

'మాటిచ్చారంటే నిలబెట్టుకొనే నాయకుడు... మడమ తిప్పని ఒకే ఒక్కడు జగనన్న' అని వైసీపీ నాయకులు పదే పదే చెబుతుంటారు. అలాంటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభలో ఇచ్చిన హామీలను కనీసం అమలు చేయకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. వివరాల్లోకి వెళితే... 2023 మే నెల 3వ తేదీన జాతీయ రహదారి సమీపంలో విమానాశ్రయ శంకుస్థాపనకు సీఎం జగన్ వచ్చారు. ఇక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నెల్లిమర్ల నియోజకవర్గానికి సంబంధించిన వివిధ సమస్యలను స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ హామీలన్నీ నెరవేర్చుతానంటూ సీఎం ప్రకటించారు. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. ఆ హామీల వైపు ఓ లుక్కేద్దామా?...

● భోగాపురం మండల కేంద్రంలోని బట్టికాలువ మరమ్మతులకు అదనంగా రూ.1.8 కోట్లు మంజూరు చేస్తామన్నారు.



ఎయిర్ పోర్టుకు శంకు స్థాపనలో ప్రసంగిస్తున్న సీఎం జగన్ (ఫైల్)

● భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లోని 45 తీరప్రాంత గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే పథకాల ఏర్పాటుకు రూ.35 కోట్లు మంజూరు చేస్తామన్నారు.

● పూసపాటిరేగ మండలం కందివలస గెడ్డపై వంతెన నిర్మాణంతో పాటు చింతపల్లి, మెంటాడ గ్రామాల మధ్య రహదారి నిర్మాణానికి రూ.10 కోట్లు ఇస్తామన్నారు.


● డెంకాడ మండలం ద్వారపురెడ్డిపాలెం గ్రామ పరిధిలో చంపావతి నదిపై కాజ్ వే నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేస్తామని చెప్పారు.

● నెల్లిమర్ల మండలం తుమ్మలపేట- గరికిపేట గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణానికి రూ2.కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఏడాది గడుస్తున్నా... నెరవేరలేదు. ఈ హామీల తీరు చూసి... జగనన్న మాట నిలబెట్టుకోవడమంటే ఇదేనేమో అంటూ ఈ ప్రాంతీయులు ముక్కున వేలేసుకుంటున్నారు.



మరమ్మతులకు నోచుకోని బట్టి కాలువ

కిక్కు.. కాలి ట్రిక్కు



- ప్రలోభాల పర్వంలో రాజకీయ నాయకులు
- రహస్య ప్రదేశాలకు మద్యం నిల్వలు
- ప్రధాన కేంద్రాల నుంచే సరఫరా
- షెడ్యూల్ వచ్చిన తరువాత 67 సారా కేసులు
- 1532 లీటర్ల మద్యం.. 170 లీటర్ల బీరు స్వాధీనం
- 61 వాహనాలు సీజ్

(విజయనగరం- ఆంధ్రజ్యోతి)

ఈసారి ఎన్నికల్లో రాజకీయ నాయకులు ముందుగానే ప్రలోభాలకు తెరతీశారు. మద్యాన్ని కీలక అస్త్రంగా వాడుకుంటున్నారు. ఎరగా వేసి కీలక వ్యక్తులను గుప్పిట్లో పెట్టుకుంటున్నారు. రహస్య ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్టోర్‌లను మద్యంతో నింపేశారని సమాచారం. ఇదంతా చూస్తే ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, ప్రలోభాలకు దూరంగా జరగటం సాధ్యమా అన్న వాదన విన్పిస్తోంది. ఇదివరకు ఎన్నడూ లేని విధంగా మాఫియా రంగప్రవేశం చేసింది. అధికార పార్టీ నేతలకు నేరుగా ప్రధాన గోదాముల నుంచి నిల్వలు వెళ్తున్నాయి. ఈ అవకతవకల నేపథ్యంలోనే బేవరేజెస్ ఎండీని విధుల నుంచి తప్పించినట్లు ప్రచారం సాగుతోంది. మరోవైపు నాటుసారాను కూడా రాజకీయ నాయకులు అధికంగా అట్టి పెట్టుకుంటు న్నారు. మత్తు పదార్థాలు సైతం రాజ్యమేలుతున్నాయి.

కాగా షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి ఈ నెల 15 వరకు 67 నాటుసారా కేసులను నమోదు చేశారు. 1475 లీటర్ల సారా పట్టుకున్నారు. 16 మందిని అరెస్టు చేశారు. 34,400 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. 53 లిక్కర్ అక్రమ రవాణా కేసులు నమోదు చేశారు. 399 కేసుల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 1532 లీటర్ల మద్యం నిల్వలు స్వాధీనం చేసుకున్నారు. 170 లీటర్ల బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. 61 వాహనాలు, ఏడు సెల్‌ఫోన్లు, రూ.50వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. 583 కిలోల గంజాయి నిల్వలను పట్టుకున్నారు. 15 మందిని అరెస్టు చేశారు. ఇలా ప్రలోభాలకు కాదేదీ అనర్హం అన్నట్లు మద్యాన్నే కీలకంగా ఉపయోగించుకుంటున్నారు.

● సారా కోసం ఏజెన్సీలోని కొందరు వ్యక్తులకు రాజకీయ నాయకుల నుంచి ఆర్డర్లు వెళ్లాయి. నల్లబెల్లం, నవ్వాసారం, యూరియా వంటి నిల్వలను పెద్ద ఎత్తున మైదాన ప్రాంతాల నుంచి ఏజెన్సీకి తరలించి అక్కడి నుంచి సారా తెప్పిస్తున్నారు. ఇదివరకు సారా గూనల్లో పులియబెట్టేవారు. ప్రస్తుతం ప్లాస్టిక్ డ్రమ్ములు వాడుతున్నారు. గత రెండు నెలల్లో చూస్తే పెద్ద ఎత్తున సారా ముడిసరుకులు ఏజెన్సీ వైపు వెళ్లాయి.

● మరో వైపు సామాజిక వర్గాల వారీగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పాటు మతపరమైన ఓటు బ్యాంకుపైనా వైసీపీ నాయకులు దృష్టి పెట్టారు. ఆయా వర్గాల వారీతో సమావేశాలు నిర్వహించి వారికి బహుమతులు అందిస్తున్నారు. వలంటీర్లు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు ఇలా చిరుద్యోగులను సైతం మభ్యపెట్టేందుకు అధికార వైసీపీ నాయకులు ప్రలోభాలకు గురి చేస్తున్నారు.

● విజయగనరం, ఎస్.కోట, బొబ్బిలి, చీపురుపల్లి తదితర నియోజవర్గాల్లో వైసీపీ నాయకులు వలంటీర్లకు దుస్తులు, నగదు పంపిణీ చేశారు. విజయనగరం ఎమ్మెల్యే షెడ్యూల్ విడుదలైన తరువాత కూడా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, పనిచేస్తున్న సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసి తనకు సహకరించాలని కోరారు. కాగా వైసీపీలో కొనసాగుతూ పార్టీని చూడకండి తనను చూసి ఓటు వేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కోరిన సంగతి తెలిసిందే.

● నామినేషన్ల స్వీకరణ తరువాత ఎన్నికల ప్రచార పర్వం మరింత ఊపందుకోనుంది. అదే స్థాయిలో ప్రలోభాలు, మద్యం పంపకాలు, డబ్బు పంపిణీ, ఘర్షణలు, బెదిరింపులు ఎక్కువ కానున్నాయి. ఈ పరిస్థితిలో ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు జిల్లా ఎన్నికల అధికారి ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంది.

రామతీర్థంలో వైభవంగా కల్యాణం

నెల్లిమర్ల: రామతీర్థంలో బుధవారం జరిగిన సీతారాముల కల్యాణోత్సవానికి మంత్రి, ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ అంబళ్ల సుధారాణి, శ్రీరాములనాయుడు దంపతులు, మత్స సత్యనారాయణ, డెంకాడ ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు దంపతులు తదితరులు హాజరయ్యారు. కల్యాణోత్సవానికి హాజరైన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. మజ్జిగ, తాగునీరు అందించారు. పది వేల మందికి మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ బి.వెంకటేశ్వరరావు, నెల్లిమర్ల ఎస్ఐ డి.రామగణేష్ బందోబస్తు ఏర్పాటుచేశారు.



పూల దండలతో అర్చకుల నృత్యం



కల్యాణ ఘట్టం



బాలల నృత్య ప్రదర్శన



గజపతినగరం: సీతారామస్వామి గ్రూపు దేవాలయంలో..



బొండపల్లి: కనిమెరక రామాలయంలో ..



భోగాపురం: పెద్ద వీధి రామాలయంలో..



బొబ్బిలి: పిరిడి గ్రామంలో రాములోరి కల్యాణం



వేపాడ: వావిలపాడులో..

అంతా రామమయం

● ఘనంగా శ్రీరామనవమి ● భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం ● పోటెత్తిన ఆలయాలు

జిల్లా వ్యాప్తంగా బుధవారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. పండితుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఆ వేడుకను కనులారా వీక్షించారు.



రాజాం రూరల్: కంచరాంలో కళకళాలతో స్వామివారి తిరువీధి



చీపురుపల్లి: వంగపల్లి పేటలో..



గరివిడి: నడిపేనపేటలో నాగార్జున పూజలు



పూసపాటిరేగ: కొప్పెర్లలో..



మెంటాడలో..



ఎల్‌కోట: శ్రీరాంపురంలో..



రామభద్రపురం: బేబీనాయన పూజలు



బాడంగి: ఎరుకుల పాకలులో పూజలు



వంగర: బాగెమ్మపేటలో..



జామిలో..



రేగిడి: పెద్దశిర్లాంలో..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు: విజయనగరం రూరల్ పరిధిలోని 11 కేవీ రావివలస, సవరవిల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా గురువారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ సురేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సవరవిల్లి, ఎ.రావివలస, సన్‌రే విలేజ్, దల్లిపేట, గూడేపువలస, బైరెడ్డిపాలెం, రెడ్డికంచేరు, రావాడ, జమ్మయ్యపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

బొండపల్లి: మండలంలోని గొట్లాం ఫీడర్ పరిధిలోని పలు గ్రామాలకు ఈ నెల 19న ఉదయం 6 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఏఈఈ శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని గొట్లాం, అంబటివలస, రోళ్లవాక, జియ్యన్నవలస, రెడ్డిపేట, అయ్యన్నఅగ్రహారం గ్రామాల పరిధిలోని విద్యుత్ వైర్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామన్నారు.

నేటి నుంచి బాలాజీ వార్షిక బ్రహ్మోత్సవాలు

రాజాం రూరల్: రాజాం సమీప అంతకాపల్లి వద్ద ఉన్న శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు ఏడు రోజుల పాటు నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ఏర్పాట్లు పూర్తి చేసింది. తిరుమలలోని వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఏటా నిర్వహించే విధంగా రాజాంలోని ఆలయంలో కూడా ఏటా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 18 నుంచి 24 వరకూ ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించింది. ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు పూర్తయినట్లవుతుంది.

నేటి ఉదయం నుంచి నామినేషన్‌లు

శృంగవరపుకోట: శృంగవరపుకోట శాసన సభ నియోజకవర్గం నుంచి పోటీచేసే అభ్యర్థుల నుంచి గురువారం ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు రిటర్నింగ్ అధికారి పి.మురళీ కృష్ణ తెలిపారు. ఈనెల 25 వరకు ప్రతి రోజు 3గంటల వరకు నామినేషన్‌లను అందించవచ్చన్నారు. ఈనెల 21 అదివారం సెలవు దినమన్నారు.

రేపు బొత్స నామినేషన్

చీపురుపల్లి: బొత్స సత్యనారాయణ చీపురుపల్లిలో ఈనెల 19న నామినేషన్ వేయనున్నట్టు వైసీపీ నాయకులు మీసాల వరహాలనాయుడు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీవాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ తెలిపారు. ఉదయం 10.30కి ఆయన నామినేషన్ వేస్తారని అనంతరం పట్టణంలోని మూడు రోడ్ల కూడలిలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని వారు చెప్పారు.

రాక్షస పాలనకు సమాధి కట్టాలి: కోళ్ల

వేపాడ: రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న జగన్మోహన రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పి సమాధి కట్టాలని కోళ్ల లలితకుమారి పిలుపునిచ్చారు. మండలంలోని కొత్త సింగరాయి, జగ్గయ్యపేట, గుడివాడ, ఆకులసీతంపేట గ్రామాల్లో బుధవారం డోర్‌టూ డోర్ కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

నేత్రదానంతో పునర్జన్మ

రాజాం రూరల్: పట్టణంలోని అమ్మవారి కాలనీకి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పెంకి గౌరీ శంకర్రావు, సోదరుడు వెంకటరావుల తల్లి పెంకి వరహాలమ్మ(80) బుధవారం ఉదయం రాజాంలో మృతి చెందారు. దీంతో వరహాలమ్మ కార్నియాలను దానం చేయాలని కుటుంబ సభ్యులు, రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య, నిర్ణయించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావుకి సమాచారం అందించారు. దీంతో శ్రీకాకుళంలోని మగటపల్లి శ్రీధర్ నేత్రసేకరణ కేంద్రం టెక్నీషియన్ కళ్యాణి సిబ్బందితో కలిసి రాజాం చేరుకుని రెండు కార్నియాలు సేకరించి విశాఖ ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రికి అందజేశారు.



వరహాలమ్మ (ఫైల్)

సూపర్ సిక్స్ హామీలను వివరించండి: అదితి

విజయనగరం రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. నగరంలోని 31వ డివిజన్ నుంచి 40 వ డివిజన్ వరకూ, 10 వార్డులకు సంబంధించి డివిజన్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, బూత్‌కమిటీ కన్వీనర్లు, టీడీపీ నగర అధ్యక్ష, కార్యదర్శులు తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు శ్రమించాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, కర్రోతు నర్సింగరావు, పిళ్లా విజయ్ కుమార్, కాళ్ల గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

అద్భుత ఆలయంగా రామతీర్థం

భక్తుల మనోభావాలను కాపాడతాం: చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దేవాలయాల సంరక్షణతోపాటు భక్తుల మనోభావాలను కాపాడతామని టీడీపీ అధినేత చంద్రబాబ ఉద్ఘాటించారు. గతంలో ఒంటిమిట్ట రామాలయాన్ని అభివృద్ధి చేసినట్టే.. ఎన్డీయే కూటమి ప్రభుత్వం వచ్చాక రామతీర్థం దేవాలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తామన్నారు. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా 'ఎక్స్' వేదికగా తెలుగు ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలుపుతూ.. 'నవమి అనగానే కడప జిల్లాలోని ఒంటిమిట్ట రామాలయంలో చేసిన అభివృద్ధి గుర్తుకు వచ్చింది. దీనితోపాటు మూడేళ్ల కిందట విజయనగరం జిల్లా రామతీర్థంలో శ్రీరాముని విగ్రహం తలను తొలగించిన దారుణ ఘటన గుర్తుకు వచ్చింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక దేవాలయాలపై దాడులు పెరిగాయి. రథాలు తగలబడ్డాయి. ఏ ఒక్క ఘటనలోనూ నిందితులు అరెస్ట్ కాలేదు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే రామతీర్థం దేవాలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తామన్నారు.

కూటమిదే అధికారం: కళా

గరివిడి: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడం ఖాయమని, తాను కూడా విజయం సాధించి, చీపురుపల్లిని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు అన్నారు. బుధవారం గరివిడిలోని టీడీపీ కార్యాలయంలో ఆయన చీపురుపల్లి పట్టణ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నాయకుడు, కార్యకర్త కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి మండల నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన శ్రీరాములు, నాగరాజు, జనసేన నాయకులు విసినిగిరి శ్రీను, టీడీపీ నాయకుడు కరణం మురళి పాల్గొన్నారు.

● **చీపురుపల్లి:** పట్టణంలోని 12, 13, 14 వార్డులకు చెందిన సుమారు 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. 13వ వార్డు మెంబరు కామేశ్వరి, ఆమె భర్త మీసాల శ్రీనివాసరావుతో సహా వీరంతా తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం చీపురుపల్లిలో జరిగిన కార్యక్రమంలో కూటమి అభ్యర్థి కిమిడి కళావెంకటరావు వారికి కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, వెంపడాపు లక్ష్మునాయుడు, లెంక చిన్నారావు, పిన్నింటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లిలో పార్టీలోకి ఆహ్వానిస్తున్న కళావెంకటరావు

నాగమాధవికి బీఫారం

నెల్లిమర్ల: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి లోకం నాగమాధవికి జనసేన పార్టీ అధినేత కె.పవన్‌కళ్యాణ్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం బీఫారం అందజేశారు. ఎమ్మెల్యే ఎన్నికకు సంబంధించి ఈనెల 18వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండడంతో ఒక రోజు ముందుగానే బుధవారం బీఫారం అందజేశారు. సమష్టి కృషి, సమన్వయంతో ఎమ్మెల్యేగా విజయం సాధించాలని పవన్‌కళ్యాణ్ ఆకాంక్షించారు.



నాగమాధవికి బీఫారం అందజేస్తున్న పవన్‌కళ్యాణ్

చంద్రబాబుకే జనం మద్దతు: కోండ్రు



పార్టీలో చేరిన బూరాడ వైసీపీనేత గులివిందల, ఇతరనేతలతో కోండ్రు

వంగర: ప్రజల మద్దతు ఎన్డీయే కూటమిలోని చంద్రబాబుకేనని రాజాం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రుమురళీమోహన్ అన్నారు. బుధవారం వంగరలో పర్యటించి ఇంటింటికీ వెళ్లి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు వాసుదేవరావు నాయుడు, పైలవెంకటరమణ, మురళికృష్ణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈనెల 19న 10.55 నిమిషాలకు నామినేషన్ వేయనున్న నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీక్యాడర్ తరలిరావాలని కోండ్రు మురళీ, రేగిడి మండల పార్టీనేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, మజ్జి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలో ఉంగరాడమెట్ట టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల టీడీపీ పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశంలో వారు మాట్లాడారు. గేదల బాలమురళీధర్, పాలవలస రామచంద్రినాయుడు, గురవాన రమేష్, మంతిన ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

● మండలంలో బూరాడ గ్రామంలో వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు. మండల వైసీపీనేత, వైస్‌ఎంపీపీ జగన్మోహనరావు స్వగ్రామం బూరాడ కాగా ఇక్కడి వైసీపీలో కీలకనేతైన గులివిందల శ్రీనివాసరావు సైకిల్ ఎక్కారు. ఈయనతో పాటు మరో 50కుటుంబాలు బుధవారం కోండ్రు క్యాంప్ కార్యాలయానికి వెళ్లి పార్టీ తీర్థం స్వీకరించినట్లు గులవిందల శ్రీనివాసరావు స్థానిక విలేఖర్లకు తెలిపారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

చీపురుపల్లి: మండలంలోని పత్రేయవలస, రామలింగపురం, బెవరపేట తదతర గ్రామాల్లో పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కవాతు నిర్వహించినట్టు ఎస్ఐ కె.కిరణ్‌కు మార్‌నాయుడు తెలిపారు. లోకల్ సిబ్బందితో పాటు ఎస్‌పీఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సీసాలు, నగదు పట్టివేత

బొబ్బిలి: పాతబొబ్బిలి జంక్షన్‌లో చెక్‌పోస్టు దగ్గర వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా పార్వతీపురం నుంచి బొబ్బిలి వస్తున్న ఓ వ్యాపారి నుంచి లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ లోవరాజు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

● బొబ్బిలి పట్టణ పరిధిలో అప్పయ్యపేట శివారులో బాడంగి మండలం పాల్తేరు గ్రామానికి చెందిన మామిడిపాక తిరుపతిరావు మోపెడ్‌పై పది మద్యం సీసాలను, పిరిడి జంక్షన్ దగ్గర పిరిడికి చెందిన శృంతవరపు వినోద్‌కుమార్ అనే వ్యక్తి 18 మద్యం సీసాలను బైకుపై తరలిస్తుండగా పట్టుపడడంతో వీరిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ రాములు, సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

వైసీపీని ఓడించాలి

తెర్లాం: మండలంలో అప్పలంపేట గ్రామంతా బుధవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రచార కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ గురాన పార్వతి, మాజీ సర్పంచ్ వారాడ సత్యంనాయుడు అధ్యక్షతన వైస్ సర్పంచ్, వార్డుమెంబర్లతో సహా పార్టీలో చేరారు. వీరందరికీ బేబీనాయన పార్టీ కండువాలు వేశారు. కార్యక్రమంలో అ గ్రామ టీడీపీ నాయకులు ముదిలి వెంకటనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు నర్సుపల్లి వెంకట నాయడు, జనసేన నాయకులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ● **రాజాం రూరల్:** సంతకవిటి మండలం వాసుదేవపట్నం గ్రామానికి చెందిన 15 కుటుంబాలు బుధవారం టీడీపీలో చేరాయి. తెదేపా సీనియర్ నాయకుడు, తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోల్ల అప్పలనాయుడు వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ● **గంట్యాడ:** సిరిపురం గ్రామానికి చెందిన నీటి సంఘం సొసైటీ సభ్యులు బుధవారం కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు ఆధ్వర్యంలో వారిని శ్రీనివాస్ పార్టీలోకి ఆహ్వానించారు.

అభిమానులతో నాగార్జున సమావేశం

చీపురుపల్లి: టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున బుధవారం చీపురుపల్లిలోని ఆయన నివాసం వద్ద అభిమానులు, పార్టీ గ్రామ స్థాయి నాయకులతో సమావేశమయ్యారు. తదుపరి కార్యాచరణపై కార్యకర్తలతో చర్చించారు. అభిమానులు, కార్యకర్తలతో ర్యాలీగా శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు.

బ్యాటరీ వాహనాలను ఎండల్లో పార్కు చేయొద్దు

విజయనగరం క్రైం: వాహనదారులు బ్యాటరీ వాహనాలను ఎండల్లో పార్కు చేయరాదని జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి సోమేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పెట్రోల్ బంకులో సిబ్బందికి, వినియోగదారులు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి కాలంలో ఎప్పుడూ పెట్రోలు ట్యాంకులు ఫుల్ చేయకూడదని లాంగ్ డ్రైవింగ్‌కు వెళ్లి వచ్చిన వెంటనే బంకులో పెట్రోలు కొట్టకూడదన్నారు. బ్యాటరీ వాహనాలు ఎండలో ఉంచినప్పుడు వెంటనే స్టార్ట్ చేయడం వల్ల ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరగడానికి కారనమౌతాయన్నారు. అగ్ని మాపక సిబ్బంది, పెట్రోల్ బంకు సిబ్బంది పాల్గొన్నారు. ● **లక్కవరపుకోట (కొత్తవలస):** అగ్నిప్రమాదాలపై కొత్తవలస అగ్నిమాపక సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. కొత్తవలసలో గల వసంతవిహార్ గృహ సముదాయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ అశోక్‌కుమార్ సమక్షంలో సిబ్బంది పలు ప్రదర్శనలు చేశారు. మహిళలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

గజపతినగరం: గృహిణులు గ్యాస్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రాధికారి ఎంఎస్‌వీ రవిప్రసాద్ అన్నారు. బుధవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అపార్టుమెంట్ భవనాల వద్ద మహిళలకు అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించారు. అగ్ని మాపక వాహనం వచ్చేందుకు భవనం చుట్టు ఖాళీ స్థలం ఉండే విదంగా నిర్మాణాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విజయనగరంలో..



గజపతినగరంలో..



లక్కవరపుకోటలో..